
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 డిసెంబర్ 2024
5
తిరుపతి



తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేధం

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి- తిరుమల : తిరుమల పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ నిర్ణయించింది. నిత్యం గోవింద నామాలతో మారుమోగే పవిత్రమైన తిరుమల దివ్య క్షేత్రంలో, గత కొంతకాలంగా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన రాజకీయ నాయకులలో కొంతమంది, దర్శనానంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోంది. ఈనేపథ్యంలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ బోర్డు ఇటీవల తీర్మానించింది. తిరుమలకు విచ్చేసి రాజకీయ విమర్శలు చేసే వ్యక్తులు ఈ విషయాన్ని దష్టిలో ఉంచుకుని తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతీసే ప్రసంగాలకు దూరంగా ఉండి టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

ఎడతెరిపిలేని వర్షం

- పొంగుతున్న కాలువలు, వాగులు, వంకలు..
- ప్రజలకు తీవ్ర అవస్థలు


ఏర్పేడులో కూలిన ఇల్లు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఫెంగల్ తుపాను కారణంగా తిరుపతి జిల్లాలో పలు మండలాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రైతులు వరి పంట నీట మునిగింది.

ఏర్పేడు మండలంలో మోదుగులపాలెం, కొత్త వీరాపురం మధ్య ఉన్న బ్రిడ్జి మీద వరద లెవెల్ గేజ్ దాటి ప్రవహించడంతో రాకపోకలు నిలిపివేశారు. ఎగువ నుంచి, మల్లె మడుగు రిజర్వాయర్ కి 162 క్యూసెక్కులు నీరు రావడంతో రిజర్వాయర్ గేట్లు ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో స్వర్ణముఖి ఉధృతంగా ప్రవహిస్తోంది. సీతారామ పేట ఇల్లు వర్షపు ధాటికి కూలింది. మడిబాక గ్రామపంచాయతీ రాజులకండ్రిగలో వరి నాట్లు పూర్తిగా నీటి మునిగాయి. దాదాపు వంద ఎకరాలకుపైగా కొత్తగా వేసిన వరి నాట్లు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తిరుపతి డెస్క్: నారాయణవనంలో పలు గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో కరెంటు లేక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగలో శుక్రవారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా మండలంలోని వీధులు, లోతట్టు ప్రాంతాలు తడిసి ముద్ద య్యాయి. కొన్ని ప్రాంతాలు ఇప్పుడిప్పుడే జలమయంగా మారుతున్నాయి. వర్షం మరింత భారీగా కురిస్తే లోతట్టు ప్రాంతాలు నీటమునిగే ప్రమాదం వుందని ఆందోళన చెందు తున్నారు. ప్రజలను అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

దొరవారిసత్రం : గత మూడు రోజులుగా భారీ వర్షాల కారణంగా రైతుల వరి పైర్లు, వరి నాడుమడులు, నీట మునిగి పంట పొలాలు చెరువుల్లా మారాయి. మండల పరిధిలోని, తీర ప్రాంతాలైన బేరిజంగాలపల్లి, వేలికాడు, కారికాడు, మీజూరు, తొగరాముడి, కట్టువపల్లి, సింగనాలతూరు, వెదురుపట్టు, తనియాలి, మోదుగుల పాలెం, తల్లంపాడు, గ్రామ పంచాయతీలలో వరి పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని గ్రామాలలో నీటి ప్రవాహానికి వరి పైరు కొట్టుకుపోయాయి. మరి కొన్ని గ్రామాలలో వర్షపు నీరు నిలువ ఉండడంతో వరి పైరు కుళ్లిపోయింది. రైతులు ఆందోళన చెందుతున్నారు.


పుత్తూరులో పొంగుతున్న కాజ్‌వే

పుత్తూరు టౌన్ : మండలంలో ఎడతెరపిలేని వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడ్డాయి. పుత్తూరు ఉప్పుకాలువలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. భవాని నగర్, కొండల్ చెరువు, తొర్రూరు, నేషనూర్, గోపాలకృష్ణపురం, ప్రాంతాలకు వెళ్లే మార్గంలో వర్షపు నీరు ప్రవేశించడంతో ప్రజలు నిత్యావసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి విద్యుత్ లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు.

రామచంద్రాపురం: రామచంద్రపురంలో మండల అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు కే వెంకటరమణ హెచ్చరించారు. వర్షం కారణంగా శుక్ర, శని వారాలు రెండు రోజులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మోస్తారు వర్షాలు కురవడం వల్ల ప్రజలు బయ టికి రాలేక ఇళ్లకే పరిమితమయ్యారు. పాడి పశువులను మేత లేక పశువుల పాకలకే పరిమితం చేసి వరిగడ్డి, వేరుశ నగ, తీగలను మేతగా వేసి పోషించుకుంటున్నారు. వంకలు, వాగుల్లో వర్షపు నీరు ప్రవహిస్తున్నాయి. రాయలచెరువుకు వర్షపు నీరు చేరి కళకళలాడుతోంది. గ్రామీణ రోడ్లు గుంతలమయమై వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల వరి పంటను దిగుబడి చేసుకోవడానికి వీలు లేక వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పెనుగాలులకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.


దొరవారిసత్రంలో నీట మునిగిన వరి

పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్ రిజర్వాయర్ గేట్లను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు శనివారం సాయంత్రం పరిశీలించారు. పిచ్చాటూరు: వర్షం కారణంగా అరణియార్ నీటిమట్టం 25 అడుగులకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పటిష్టతపై ఎస్పి సుబ్బరాయుడు ఆరా తీశారు. ప్రస్తుతం జలాశ యానికి ఇన్ ఫ్లో 3500 క్యూసెక్కులుగా నమోద యిందని, ప్రాజెక్టు నీటిమట్టం 27 అడుగులకు చేరిన వెంటనే గేట్లను పైకెత్తి అధిక వరద నీటిని దిగువకు వదులుతామని ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్ రెడ్డి ఎస్‌పికి వివరించారు.

నాయుడుపేట: ఎడతెరిపి లేని వర్షాలకు నాయుడుపేట అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలో ఎక్కడ చూసినా చెరువులు తలపించేలా సైడ్ కాలువలు నిండి రోడ్లపై నీరు వెల్లువగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో హాస్టళ్లలో నీరు విపరీతంగా ప్రవహించి పిల్లలు బయటకు రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విమానం దారిమళ్లింపు

తిరుపత టౌన్: హైదరాబాద్ నుంచి రేణిగుంటకు ఉదయం 10.35 గంటలకు రావలసిన ఇండిగో విమానాన్ని అధికారులు దారి మళ్లించారు. గత రాత్రి నుంచి తిరుపతి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటం ఆకాశం మేఘావృతం కారణంగా విమానాన్ని బెంగళూరుకు పంపినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే విమానాన్ని బెంగళూరు నుంచి రేణిగుంటకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన 7 విమానాలు హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన 7 విమానాలు వర్షం కారణంగా రద్దయ్యాయి.

తిరుమలలో భక్తుల ఇబ్బందులు

తిరుమల: తిరుమలలో వర్షంతో పాటు భారీగా ఈదురు గాలులు, పొగమంచు కారణంగా చలి పెరిగి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టీటీడీ సూచించింది. ఘాట్ రోడ్డులో వచ్చే వాహనాలకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తమైంది. భారీ వృక్షాలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో టీటీడీ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. పాపవినాశనం, శ్రీవారి పాదాలు మార్గాలను మూసివేసింది. వర్షాలు, ఈదురుగాలుల ప్రభావం తగ్గిన తర్వాతే వాటిని తెరవనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరింది. మొన్న రాత్రి నుంచి వర్షం కురుస్తుండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఘాట్ రోడ్డు లో కూడా భక్తులు టిటిడి చేపట్టిన జాగ్రత్తలు పాటించాలని కోరుతోంది.

అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దు: కలెక్టర్

తిరుపతి టౌన్: ఫెంగల్ తుపాను నేపథ్యంలో తిరుపతి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ ప్రయాణాలు చేయొద్దని, కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్న సందర్భంలో పొరపాటున దాటకూడదని, జిల్లా యంత్రాంగం ఎటువంటి ఆస్తి , ప్రాణ, పశు ప్రాణ నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలు చేపట్టి ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా వుందని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ శనివారం పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూం లు ఏర్పాటు చేశామని, సంబంధిత అధికారులు అందుబాటులో వుండాలని ఆదేశించారు. కోస్తా తీర ప్రాంతాలకు వెళ్లకుండా మత్స్యకారులను అప్రమత్తం చేసి వేటకు వెళ్లకుండా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అధికా రులందరూ 24/7 వారి ప్రధాన కార్యా లయంలో అందు బాటులో ఉండాలని ఆదేశిం చారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిం చిన నేపథ్యంలో ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి అప్రమత్తం చేయాలని సూచిం చారు. కోస్తా తీర ప్రాంతాలైన గూడూరు డివిజన్ కోట, చిల్లకూరు, వాకాడు మండలాలు, సూళ్లూరుపేట డివిజన్‌లోని తడ తదితర మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. చెరువులు, కాలువల వెంబడి అధికారులు పర్యటించి కరకట్టలను ఎప్పటికప్పుడు పరిశీలిం చాలని సూచించారు. కాజ్ వేలపై నీరు ప్రవహిస్తుంటే దాటడానికి అనుమతించకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పోలీస్, ఆర్అండ్‌బి పంచాయతీ రాజ్ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి విపత్తును అయినా ఎదుర్కొనేందుకు అన్ని విధాల సంసిద్ధంగా ఉన్నామని, భారీ వర్షాల నేపథ్యం లో తిరుపతి కలెక్టరేట్ లో మండల, డివిజన్, జిల్లా స్థాయిలో సైక్లోన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఏదైనా సహాయం, సమాచారం కోసం కింది నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

కలెక్టరేట్ తుపాను కంట్రోల్ రూమ్ నెంబర్: 0877-2236007
గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం: నెం- 8624252807
సూళ్లూరుపేట ఆర్‌డిఓ కార్యాలయం: నెం- 8623295345
తిరుపతి ఆర్‌డిఓ కార్యాలయం: నెం-7032157040
శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం: నెం- 8555003504

తిరుపతి జిల్లాలో పలు మండలాల్లో వర్షపాతం

తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో రికార్డు స్థాయిలో భారీ వర్షాలు పలు మండలాల్లో నమోదయ్యాయి. శుక్రవారం నుంచి శనివారం రాత్రి 7గంటలు వరకు పలు మండలాల్లో రికార్డు స్థాయిలో 15 సెంటీ మీటర్ల పైగా వర్షాలు నమోదు అయినట్లు గణాంకాల అధికారి తెలిపారు. ఇప్పటికే పలు డ్యాములు, చెరువులు ఈ వర్షాలకు నిండాయని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. నారాయణవనం 150.6, సూళ్లూరుపేట 145 .0, తడ 140 . 8, వాకాడు 130 .6, వరదయ్యపాలెం 130.0, చిట్టమూరు 129.8, పుత్తూరు 129.6, దొరవారిసత్రం 123.8, పిచ్చాటూరు 122.4, సత్యవేడు 109.0, వడమాలపేట 107.8, కెవిబి పురం 107.6, బుచ్చి నాయుడు కండ్రిగ 93 .0, పెళ్లకూర్ 88.6, నాయుడుపేట 87.6, కోట 85.0, ఓజిలి 84.9, తొట్టంబేడు 82.8, బాలాయపల్లి 80.2, శ్రీకాళహస్తి 74.2, నాగలాపురం 67.8, ఏర్పేడు 65.8, తిరుపతి (అర్బన్) 61.0మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. రేణిగుంట 59.6 మిల్లీ మీటర్లు, డక్కిలి 52.2, వెంకటగిరి 52.0, చిన్నగొట్టిగల్లు 50.8, గూడూరు 46.6, రామచంద్రాపురం 46.4, యర్రావారిపాలెం 45.4 తిరుపతి (గ్రామీణ) 45.0, చిల్లకూరు 44.4, చంద్రగిరి 31.8, పాకాల 26.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదయింది.

శ్రేణుల్లో స్ఫూర్తి నింపిన

ఉద్యమ 'ఫలితాలు'

- నిర్బంధాలను ఎదుర్కొంటూనే ఆందోళనలు
- నేడు, రేపు సత్యవేడులో సిపిఎం మహాసభలు


వ్యవసాయ కళాశాలలో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సిపిఎం పోరాటాలు ప్రజల్లో చైతన్యం నింపాయి. దీర్ఘకాలిక ఉద్యమాలు ఫలితాలను ఇవ్వడంతో పార్టీ శ్రేణుల్లోనూ స్ఫూర్తిని నింపాయి. మిలిటెంట్ పోరాటాలతో ముందుకు వెళుతూ, ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజాపక్షాన నిలిచి పేదల గొంతుకగా నిలిచింది. ఈ మూడేళ్ల కాలంలో సిపిఎం నిర్వహించిన పోరాటాలు అమోఘం. అధికారంలో ఉంటే అందలం, అధికారం లేకుంటే ఇంటికే పరిమితమయ్యే బూర్జువా పార్టీలను చూస్తుంటాం. అయితే అధికారం ఉన్నా, లేకున్నా ప్రజా సమస్యలే నాడిగా, ఉద్యమాలే ఊపిరిగా సిపిఎం పోరాటాలు చేసింది. టిటిడి ఫారెస్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై 1138 రోజులు అంటే దాదాపు 38 నెలల పాటు రిలేదీక్షలు జరిగాయి. ఆ పార్టీ నాయకులు కందారపు మురళి ఆధ్వర్యంలో నిరాహారదీక్షలకు కార్మికులు వెనుకాడలేదు. పార్టీ చేసిన పోరాటాలకు టిటిడి యాజమాన్యం దిగి వచ్చింది. మొండి వైఖరి విడనాడి ఫారెస్టు కార్మికులకు టైంస్కేలుతో కూడిన వేతనాన్ని అమలు చేస్తామని హామీ ఇవ్వక తప్పలేదు. మళ్లీ అలాంటి పోరాటమే తాజాగా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు చేస్తున్న నిరసన వందో రోజుకు చేరుకుంది.

తిరుపతి జిల్లా సిపిఎం 14వ మహాసభ రెండు రోజుల పాటు సత్యవేడులో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ, ప్రజాసంఘాలు చేసిన పోరాటాలను పరిశీలిస్తే కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిందని చెప్పవచ్చు. ముఖ్యంగా టిటిడిలో పనిచేస్తున్న ఎఫ్ఎంఎస్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు 6వేల మందికి జీతాలు పెంచాలని 17 రోజుల పాటు టిటిడి పరిపాలనా భవనం ఎదుట నిరవధిక ఆందోళన జరిగింది. ఈ ఉద్యమం ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపింది. వేలాదిమందిని అరెస్టు చేశారు. దీనికి సహకరించారని టిటిడిలోని ముగ్గురు పర్మినెంట్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అయినా ఎర్రజెండా వెనకడుగు వేయలేదు. పోరాడింది. ఒక్కో కార్మికునికి ఐదువేల రూపాయల జీతాన్ని అదనంగాపెంచుకుంది. జానపద కళాకారులకు టిటిడిలో అవకాశం కల్పించాలని ఆందోళన చేపట్టింది. అప్పటి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి జోక్యం చేసుకుని అవకాశం కల్పించారు. 'ఆలాపన' కార్యక్రమం మహతి ఆడిటోరియంలో నాలుగు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేసింది. శెట్టిపల్లి భూముల సమస్యపైనా బాధితులకు అండగా దీర్ఘకాలిక పోరాటం నడిపింది. తత్‌ఫలితంగా వైసిపి హయాంలో 'ప్రొసీడింగ్' కాపీలను ఇప్పించింది. శెట్టిపల్లి భూబాధితుల కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికీ పోరాటం కొనసాగుతోంది.


పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని తిరుపతిలో రాష్ట్రస్థాయి మహిళా సదస్సు జరిగింది. ఐద్వా జాతీయ నాయకురాలు మిరియం థావలే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర రాష్ట్ర పిలుపుల మేరకు ఆందోళనలు చేస్తూనే, స్థానిక సమస్యలపైనే ఉద్యమాలు జరిగాయి. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ ఎర్రగుట్ట భూపోరాటం నెలరోజుల పాటు సాగింది. ఆటపాటలతో రేయింబవళ్లు నిరసనలు తెలియజేశారు. వారికి అండగా నిలిచిన జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుపై పోలీసులు కేసు బనాయించారు. వైసిపి ప్రభుత్వం జాబ్‌క్యాలెండర్ అమలు చేయాలంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇంటి ముందు నిరుద్యోగులు ఆందోళన చేశారు. 20 మందిపై కేసులు నమోదు చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని నిర్బంధాలను సైతం లెక్కచేయక 42 రోజుల పాటు నిర్వహించిన సమ్మె పోరాటాల్లో 'హైలెట్'. విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ, మహిళలపై దాడులకు ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారని బాలాయపల్లి, వెంకటగిరి, శ్రీకాళహస్తిల్లో స్కీం వర్కర్లపై వేధింపులు పెరగడంతో వారికి అండగా నిలిచింది. చెరకు రైతుల బకాయిలు మయూర సుగర్ ఫ్యాక్టరీ చెల్లించాలని పోరాడిన ఫలితంగా 21 కోట్లు చెల్లించింది. కాటూరు రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో దళితులకు పట్టాలు ఇవ్వాలని ఆందోళన చేసింది. ఫలితంగా స్థానికేతరుల పట్టాలను రద్దు చేసి, సాగులో ఉన్న దళితులకే పట్టాలను ప్రభుత్వం ఇచ్చేలా చేసింది. రాచపాళ్యం దళిత యువకుడు కుమార్ హత్యకు గురి కావడంతో దళితసంఘాల ఆధ్వర్యంలో నెలరోజుల పాటు ఆందోళన నిర్వహించారు. తొట్టంబేడు మండలం కాంచనపల్లి గ్రామంలో భూ సమస్య పరిష్కారమయ్యింది. అదే మండలంలో తంగెళ్లపాలెం, శ్రీరాంనగర్ వాసులకు ఇళ్లస్థలాలు, తాగునీటి సమస్య పరిష్కరించడం జరిగింది. శ్రీకాళహస్తిలో హమాలీలకు కూలిరేటు పెంచేలా చేశారు.

ప్రజా సమస్యలే అజెండా



వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా సిపిఎం 14వ మహాసభల్లో చర్చించనున్నాం. ఆది, సోమవారాల్లో సత్యవేడులోని విఎంకె కల్యాణ మండపంలో కా॥ సీతారాం ఏచూరి నగర్ ప్రాంగణంలో ఈ మహాసభలు జరగనున్నాయి. ఈ మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంపి పెనుమల్లి మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. 150 మంది ప్రతినిధులు ఉంటారు. 50 మంది అతిథులుగా విచ్చేస్తారు. పార్టీలో సీనియర్లకు సత్కారం ఉంటుంది. తొలిరోజు శ్రీకాళహస్తి రోడ్డులోని సాయిబాబా గుడి నుంచి ప్రాంగణం వరకూ వేలాదిమందితో ర్యాలీ, బహిరంగసభ జరుగుతుంది. మహాసభల్లో ప్రధానంగా మూడు అజెండాలు ఉంటాయి. గత మూడేళ్లలో పార్టీ నిర్వహించిన ప్రజా ఉద్యమాలపై సమీక్ష ఉంటుంది. జిల్లాలోని ప్రజా సమస్యలపై తీర్మానాలు చేస్తాం. భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకుంటాం. జిల్లాకు సమీపంలోనే రాష్ట్ర మహాసభలు నెల్లూరులో జరగనున్నాయి. జాతీయ మహాసభలు మధురైలో జరగనున్న నేపథ్యంలో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేయనున్నాం. ఈ రెండు రోజుల పాటు జరిగే మహాసభలకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ అధ్యక్షత వహిస్తారు.


ఎర్రగుట్ట ఇళ్లస్థలాల పోరాటం


అంగన్‌వాడీల పోరాటం

జిల్లాలో పోక్సో.. షో!

ప్రభుత్వాన్ని ఎదిరిస్తే జైలే

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో పోక్సో షో నడుస్తోంది. దుర్మార్గులు, కిరాతకులు గుండెల్లో భయం పుట్టించి, అరాచకాలను అదుపులో ఉంచేందుకు తీసుకొచ్చింది పోక్సో చట్టం. కానీ అలాంటి చట్టం పాలకులకు చుట్టంగా మారుతోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, కూటమి నాయకులను నిలదీసినా, అన్యాయాన్ని వేలెత్తి చూపినా ఈ చట్టం పేరుతో కేసులు పెట్టడం, బెదిరించి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రత్యర్థులకే కాదు.. పాత్రికేయులపై సైతం ఈ చట్టం కింద కేసులు పెడుతుండడం గమనార్హం.

మృగాళ్లను కఠినంగా శిక్షించేందుకు పోక్సో చట్టం 2012లో తీసుకొచ్చిన కఠినమైన చట్టం. పోక్సో చట్టం లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం. బాలబాలికలపై లైంగిక వేధింపుల నిరోధానికి రూపొందించిన పిల్లల రక్షణకు రూపొందించిన చట్టం. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్ (పోక్సో). 2012 మే 22న భారత పార్లమెంట్ ఆమోదించింది. అదే యేడాది నవంబరు 14న నుంచి అమల్లో వచ్చింది. 2012లో వచ్చిన పోక్సో చట్టం 18 ఏళ్లలోపు పిల్లలందరికి లైంగిక వేధింపు నుంచి రక్షణ కల్పిస్తుంది. వారిపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్షలతో పాటు మరణ శిక్ష కూడా విధిస్తారు. ఇంతటి కఠినమైన యాక్టు అది. అలాంటి యాక్టును తిరుపతి జిల్లాలో ప్రత్యార్థులను, ప్రశ్నించేవారిని భయభ్రాంతులకు గురి చేసేందుకు వినియోగిస్తుండటం గమనార్హం. అందుకు ఇటీవల జరిగిన ఘటనే నిదర్శనం. నవంబరు 4వ తేది ఎర్రవారిపాలెం యలమందకు చెందిన ఓ బాలిక స్కూలు నుంచి ఒంటరిగా వస్తుంటే ఇద్దరు వ్యక్తులు అడ్డగించి నిద్రమాత్రలు మింగించి దాడి చేశారని బాధితురాలే స్వయంగా చెప్పడంతో ప్రతిపక్ష నాయకులతో పాటు సోషల్ మీడియా, మీడియా కూడా దాన్ని ప్రచారం చేసింది. కానీ అత్యాచారం జరగలేదు, దీన్నిపై సోషియల్ మీడియా అసత్య ప్రచారం చేయవద్దని జిల్లా ఎస్‌పి స్వయంగా హెచ్చరించారు. మరుసటి రోజు ఆసుపత్రి వద్ద బాధితురాలి తండ్రి చేత కూడా ఇదే మాటను పోలీసులు చెప్పించారు. వారం తర్వాత 4వ తేది జరిగిన ఘటనలో మైనర్ బాలిక బాధితురాలే ఆమె స్నేహితుడితో పాటు వెళ్లడంతే ఇంటికి వెళ్లేందుకు ఆలస్యం కావడంతో పోలీసులకు, మీడియాకు తప్పుడు కథ చెప్పిందని, ఎవ్వరూ ఎలాంటి దాడి, అఘాయిత్యం చేయలేదని ఎస్‌పి మీడియా ముందు నిర్ధారించారు. అంతటితో ఆ కథముగిసింది అనుకున్నారు అంతా. కానీ అక్కడే అసలు కథ మొదలైంది. అధికార పార్టీ ఒత్తిడి, ప్రభుత్వ పెద్దల చొరవతో ప్రత్యర్థులను ఇబ్బందికి గురి చేయాలని భావించారు. బాధితురాలు మైనర్ కావడంతో ఆమెను ఆస్పత్రి వద్ద పరామర్శించడం, దాన్ని సోషియల్ మీడియాలో పెట్టడం తప్పని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై ఏకంగా పోక్సో చట్టంతో పాటు మరో 11 సెక్షన్ల కింద మూడు రోజుల క్రితం కేసులు పెట్టారు. పరామర్శిస్తేనే పోక్సో పెడుతారా? అని దీనిపై విమర్శలు రావడంతో మీడియా ప్రతినిధులను సైతం ఇందులో ఇరికించారు. వైసిపి అనుకూల సోషియల్ మీడియా నిర్వహకులపై కేసులు పెట్టిన పోలీసులు, ప్రధాన పత్రికలైన ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ విలేకర్లపై సైతం పోలీసులు పోక్సో కేసు నమోదు చేయడం గమనార్హం. ప్రత్యర్థులను ఇబ్బందికి గురి చేయడం కోసం బాధితురాలు చెప్పిన విషయాన్ని ప్రచారం చేసిన వారిపై కూడా కఠినమైన కేసులు నమోదు చేయడం విడ్డూరం. పోలీసుల పనితీరును ప్రశ్నించినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేసినా కేసు పెట్టి బెదిరించడం శోచనీయం. ఇది ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం మనుగడ కష్టతరమవుతుంది. ప్రభుత్వ పెద్దలు, మేధావులు దీన్ని ఖండించి, ఇలాంటి బెదిరింపులను పునరావృతం కానీయకుండా చేయాల్సిన అవసరం వుంది.

జోరు వానలో పారిశుద్ధ్య పనులు

పరిశీలించిన కమిషనర్ ఎన్ మౌర్య

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తుపాను కారణంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం తెల్లవారు జామున నగరంలోని అన్నమయ్య కూడలి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, ముత్యాల రెడ్డి పల్లి, వెస్ట్ చర్చి రోడ్డు తదితర ప్రాంతాల్లో జోరు వానలో పారిశుద్ధ్య పనులను హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా రోడ్లపై వర్షపు నీరు రాకుండా కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్త, కాలువల్లో మురుగు తొలగించాలని అధికారులను ఆదేశించారు. చెత్త కుప్పలను ఉదయాన్నే తొలగించి, శుభ్రం చేయించాలన్నారు. పలు చోట్ల డివైడర్లు పగిలి ఉండడం, ఫుట్ పాత్‌పై గుంతలు ఉండడాన్ని గుర్తించి వాటికి మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తుపాను వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా కంట్రోల్ రూమ్ నంబర్ 0877 2256766 ను సంప్రదించాలని కమిషనర్ ప్రజలను కోరారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ తులసికుమార్, తుడా ఈఈ రవీంద్ర, డిఈ మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య ఉన్నారు.


వర్షంలోనూ పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్

పడకేసిన పారిశుధ్యం!

పట్టించుకోని ఎస్వియూ ఇంజనీరింగ్ అధికారులు

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థ, ఉన్నత విద్యకు నిలయమైన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో క్యాంపస్ లో పారిశుధ్యం పడకేసింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 1500 ఎకరాలలో సువిశాలమైన ప్రాంతంలో ఉన్నతమైన కళాశాల భవనాలతో పాటు వసతి గృహ భవనాలను ఏర్పాటు చేసి వర్సిటీ క్యాంపస్ ను అందంగా తీర్చిదిద్దారు. అయితే గత కొంత కాలంగా వర్సిటీ సిబ్బంది నివసించే పరిసర ప్రాంతాలలో, విద్యార్థుల వసతి గృహ సముదాయాలలో, కళాశాలల భవనాల ప్రాంతాలలో మురుగునీరు చేరి అడ్డదిడ్డంగా పేరుకుపోయింది. దీన్ని పరిశీలించి, పర్యవేక్షించి సంబంధిత ఉద్యోగుల వద్ద బాగు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నవంబర్ నుంచి ఫిబ్రవరి నెల వరకు నైరుతి రుతుపవనాలు ద్వారా తిరుపతికి అధిక వర్షాలు వచ్చే అవకాశం వుంది. ఈ వర్షాలతో పెరిగిపోయిన మురుగు నీరుతో అక్కడికి చేరిన దోమలు, ఈగలు, ఇతర క్రిమి కీటకాల వల్ల సిబ్బంది విద్యార్థులకు అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం వుంది. సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకుల ఆరోగ్య భద్రత విషయంలో ఇంజనీరింగ్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. వర్సిటీలోని పలుచోట్ల మురుగునీరు పేరుకుపోయి విద్యార్థులు, సిబ్బంది నడిచి వెళుతుంటే తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు వాపోతున్నారు. వర్సిటీలో కాంపిటీటివ్ సెల్ ఏర్పాటు చేసి విద్యార్థులు 24 గంటలు నిరంతరం పోటీ పరీక్షలకు, ఇతర పరీక్షలు చదువుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన భవనం ఖాళీగా మూతపడి వుంది. దాని ఎదురుగా మురుగునీరు పేరుకుపోయి విద్యార్థులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. బాలికల వసతిగృహం చుట్టుపక్కల, బాలుర వసతిగృహం పరిసరాల్లో మురుగునీరు పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వర్సిటీలో దోమలు పెరిగిపోయాయని వాటిని నివారణ చేయకపోవడం వల్ల అంటువ్యాధులు, తీవ్ర జ్వరాలతో ఆసుపత్రి పాలవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆరోగ్య కేంద్రంలో అనారోగ్యంతో వస్తున్న విద్యార్థుల సంఖ్య పెరిగిపోతోంది. వర్సిటీ వసతిగృహం, మెస్ ల చుట్టూ పూర్తి స్థాయిలో అపరిశుభ్రంగా ఉండడం మురుగు నీరు లీకేజీల వల్ల తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు, పరిశోధకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీ ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల్లో నివసించే సిబ్బంది ప్రదేశంలో టెన్నిస్ కోర్టు పక్కన మురుగునీరు వెళుతుండడంతె అక్కడ నివసించే సిబ్బంది తీవ్ర అనారోగ్యం పాలై ఆస్పత్రికి వెళు తున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యార్థులు, పరిశోధకులు, సిబ్బంది సమస్యలను గుర్తించి సకాలంలో శు



భ్రం చేయాలని విద్యార్థి సంఘాల నేతలు ఇంజనీరింగ్ అధికారులను కోరుతున్నారు. లేని పక్షంలో వర్సిటీ పరిపాలన భవనం ఎదుట పెద్ద ధర్నా నిర్వహిస్తామని విద్యార్థి సంఘ నేతలు హెచ్చరిస్తున్నారు.

స్థానికులకు 3న శ్రీవారి దర్శనం : టిటిడి

ప్రజాశక్తి -తిరుమల: డిసెంబర్ 2న సోమవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో , తిరుమలలోని బాలాజీ నగర్ లోని కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేయనున్నారు. టిటిడి ధర్మకర్తల మండలి నవంబర్ 18న జరిగిన తొలి సమావేశంలో ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డిసెంబర్ 3న (మొదటి మంగళవారం) స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు టిటిడి ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా డిసెంబర్ 2న సోమవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో, తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఉదయం 5 గంటలకు టోకెన్లను టిటిడి జారీ చేయనుంది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి , రేణిగుంట మండలాలతో పాటు తిరుమలకు చెందిన స్థానికులు తమ ఆధార్ ఒరిజినల్ కార్డును చూపించి టోకెన్లు పొందవచ్చని టిటిడి తెలిపింది.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించండి. సిపిఎం

ప్రజాశక్తి -సత్యవేడు: తిరుపతి జిల్లాలో శనివారం తుపాన్ కారణంగా ఉదయం 6 గంటల నుండి సత్యవేడు నియోజకవర్గం కేంద్రం, పలు మండలాల్లో, గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్రమైన అంతరాయం ఏర్పడి సరఫరా నిలిచి నిలిపివేశారని, దీని కారణంగా ప్రజలు తాగునీరు, అవసరాలకు వాడే నీరు లేక చిన్న పిల్లలు, వృద్ధులు , బాలింతలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి జనార్ధన్ శనివారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. విద్యుత్ సరఫరా ఏ కారణంగా పునరుద్ధరించలేకపోతున్నారో అర్థం కావడం లేదన్నారు. అధికారులు ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటే ఇలాంటి పరిస్థితి తలెత్తేది కాదన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆయన డిమాండు చేశారు.

క్రీడాకాలకు సన్మానం



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: టిటిడిలో సీనియర్ సహాయకుడిగా విధులు నిర్వహిసూ, టిటిడి విద్యాసంస్థల తైక్వాండో శిక్షకుడిగా వ్యవహరిస్తున్న మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడు కుమార్తెలు భవిష్య, సంజనలను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అభినందించారు. మొదటి కుమార్తె భవిష్య తైక్వాండో లో జాతీయ స్థాయిలో రాణిస్తూ బ్లాక్ బెల్ట్ సాధించింది. ఫెన్సింగ్ లో జాతీయ స్థాయిలో ఏడుసార్లు ప్రాతినిధ్యం వహించింది. రెండో కుమార్తె సంజన ఫెన్సింగ్ లో జాతీస్థాయిలో రెండుసార్లు ప్రాతినిధ్యం వహించింది. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఒలింపిక్స్‌కు ఎంపిక కావాలని శాప్ ఛైర్మన్ రవి నాయుడు సూచించారు. శిక్షణకు శాప్ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇద్దరినీ శాలువాతో సత్కరించారు.

ఎయిడ్స్‌కి చికిత్స లేదు..నివారణే మార్గం..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎయిడ్స్‌కు దీనికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్ డాక్టరు బి. చంద్రమౌళి అన్నారు. డిసెంబరు 1వ తేది 'ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం' సందర్భంగా శనివారం కళాశాలలో శనివారం 'అవగాహన సదస్సు' నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కరోనా వ్యాధి తీవ్రత వల్ల ఎయిడ్స్‌ని సమాజం పట్టించుకోవడం లేదని, ఎయిడ్స్ ప్రమాద తీవ్రత ఇంకా తగ్గనిలేదన్నారు. అనంతరం. కళాశాల ఆవరణలో వర్షంలోనే ర్యాలీ నిర్వహించారు. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలను బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు వ్యాధిని అరికట్టే మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, డాక్టరు కోటేశ్వరయ్య, ఆర్ఆర్‌సి కన్వీనర్లు డాక్టరు షర్మిల, ఎన్ సి సి అధికారి జాయం శ్రీనివాసులు, ఎన్‌సిసి అధికారి శ్రీనివాసలు, బాబూరావు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ , సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ పేదలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. త్వరలోనే నూతన ఆసుపత్రి భవనాలను అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు. ఆసుపత్రిలోని పలు సమస్యలు , చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా పాల్గొన్నారు.

తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఫెంగల్ తుపానుతో గూడూరు మండలంలో రాత్రి నుండి వర్షం కురుస్తుందని మరో మూడు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపిందని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు మండల తహశీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని మండల తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తహశీల్దారు చంద్రశేఖర్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో రాత్రి నుండి వర్షం కురుస్తుందని రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని సమస్యలు ఏమైనా ఉంటే ఈ నెంబరుకు 7416108251 తెలపాలని కోరారు. నీటి ప్రవాహ సమయాల్లో బ్రిడ్జిలపై ప్రయాణం చేయవద్దని సూచించారు.

సింహ వాహనంపై యోగ నరసింహుడు అలంకారంలో శ్రీ పద్మావతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శనివారం రాత్రి సింహ వాహనంపై యోగ నరసింహుడు అలంకారంలో పద్మావతి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తుపాన్ నేపథ్యంలో వాహన మండపంలో భక్తులు అమ్మవారిని సేవించుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఈవో శ్యామల రావు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణముఖి నదీ హారతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్వర్ణముఖి నదీ హారతుల కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి నదికి శైవాగమం ప్రకారం పూజలు చేసి హారతి ఇచ్చారు. వర్షంలోనూ నదీ హారతి ఇవ్వడం విశేషం. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బొజ్జల బృందమ్మ, ఈవో బాపిరెడ్డి, టిడిపి నాయకులు విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, పేరం ధనంజయులు నాయుడు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




నది హారతి ఇస్తున్న అర్చకులు

ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలి: ఎస్‌పి

పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ ఆదేశాలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తుపాను నేపథ్యంలో నీటి ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా గేట్లు ఎత్తడానికి ముందు అరుణానది పరివాహక ప్రాంత ప్రజలకు, అరుణానది ప్రవహించే తమిళనాడు లోని కలెక్టర్లకు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం అందిస్తామని ఎస్‌పి సుబ్బరాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన అరణియార్ ప్రాజెక్టును సందర్శించారు. అక్కడి అధికారులతో అప్రమత్తతపై చర్చించారు. తద్వారా ఎలాంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలకు ఏర్పాట్లు చేస్తామని ఆయన వివరించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, ప్రజలను ఎస్‌పి హెచ్చరించారు. వరదలు వల్ల ఎలాంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిస్థితి చేయి దాటుతున్నట్లు అనిపిస్తే వెంటనే తనకు, జిల్లా



అరణియార్ గేట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి సుబ్బరాయుడు

కేంద్రంలోని కంట్రోల్ రూమ్ కు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డిఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, ఎస్సై వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.50 లక్షల విరాళం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ముంబైకి చెందిన జీన్ అండ్ బోమని ఎ దుబాష్ ఛారిటీ ట్రస్ట్ శనివారం టిటిడిలోని శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్ (స్విమ్స్)కి రూ.50 లక్షలు విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో జె శ్యామలరావు చాంబర్‌లో ఆ ట్రస్ట్ ప్రతినిధి చంద్రశేఖర్ చెక్కును ఈవోకు అందజేశారు. గతంలో కూడా ఈ ట్రస్ట్ వివిధ సందర్భాలలో స్విమ్స్‌కు ఏడు కోట్లు విరాళంగా అందించి ఉన్నారు.

నేడు మహిళా వర్సిటీలో కృష్ణవేణి సంగీత నీరాజనం

ప్రజాశక్తి - క్యాంపస్ : కృష్ణవేణి సంగీత నీరాజనం 2024 వేడుకకు పూర్వ రంగంగా, భారత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో పర్యాటక మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, టెక్స్ టైల్ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా డిసెంబర్ 1వ తేదీన సంగీత కచేరీ కార్యక్రమాలను నిర్వహించనున్నారనీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ఘనత కలిగిన సంగీత కచేరీలను ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలలో నిర్వహించనున్నారనీ, సంగీత అభిమానులకు కచేరీల నిర్వహణ ద్వారా సుస్వర వారసత్వ, భక్తి సంబంధ అనుభూతిని అందించడానికి కృష్ణవేణి సంగీత నీరాజనం వేడుక సిద్ధమైందని వెల్లడించారు.

అత్యంత శక్తివంతమైన మైక్రోస్కోప్ ప్రారంభం


ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో డిఎస్టి పర్స్ కేంద్రంలో అత్యంత శక్తివంతమైన మైక్రోస్కోప్ 'హెచ్‌ఆర్ టిఈఎం' నూ వర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలో జీవ, లోహ, రసాయన, నానో టెక్నాలజీ పరిశోధనలకు ఈ పరికరం ఎంతో ఉపకరిస్తుందన్నారు. తద్వారా వైరస్ లేదా లోహ కణాలు లక్ష రెట్లు పెద్దదిగా చేసి చూడొచ్చని పేర్కొన్నారు. నానోస్కేల్ పరికరాల అసెంబ్లింగ్, నిర్మాణాన్ని ఈ పరికరం ద్వారా విశ్లేషించవచ్చన్నారు. నానోస్కేల్ వద్ద పదార్థం ప్రాథమిక లక్షణాలను అర్థం చేసుకోవాలనుకునే పరిశోధకులకు ఇది ఒక అనివార్య సాధనమన్నారు. పర్సు సెంటర్ డైరెక్టర్, విక్రమ సింహపురి ఉపకులపతి ఆచార్య విజయభాస్కరరావు మాట్లాడుతూ ఈ మైక్రోస్కోపీ పేరు హెచ్‌ఆర్ టిఈఎం జోయల్ జెం2100, ఇది ఎంతో విలువైందని, దీనికి సుమారుగా ఐదున్నర కోట్లు వెచ్చించామని అన్నారు. ఇది సంక్లిష్టమైన వివరాలను బహిర్గతం చేయగల సామర్థ్యం కలిగి ఉండి, సైన్స్, ఇంజనీరింగ్ రంగాలలో విప్లవాత్మక మార్పులు చేస్తున్నదని అన్నారు. ఈ పరికరం వర్సిటీలో అందుబాటులోకి రావడంతో పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కేటి రామకృష్ణారెడ్డి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైక్రోస్కోప్‌ను ప్రారంభిస్తున్న విసి అప్పారావు

6న ఆకేపాటి మహా పాదయాత్ర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథరెడ్డి 22వ తిరుమల మహా పాదయాత్రను ఈనెల 6 తేదీన రాజంపేట మండలం ఆకేపాడు నవోదయ కాలనీ వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం నుండి ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శంకరయ్య తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఈ మహా పాదయాత్రకు సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. గడిచిన 21 సంవత్సరంలుగా అన్నమయ్య కాలినడక మార్గం ద్వారా వేలాది మంది గోవింద మాలలు ధరించి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 6వ తేదీ మహా పాదయాత్ర ప్రారంభమై మార్గమధ్యంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో సేదతీరి



8వ తేదీ రేణిగుంట కడప మార్గంలోని కేశవరెడ్డి స్కూల్ వద్ద నుండి తిరిగి మహా పాదయాత్ర ప్రారంభమై అన్నమయ్య నడిచిన కాలిబాట మార్గంకు చేరుకొని అక్కడి నుండి తి ం ు వ ు ల క ు బయలుదేరుతారన్నారు. ఈ గోడ పత్రిక ఆవిష్కరణలో అనంత పద్మనాభ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం చిన్న మిట్ట కండ్రిగ పంచాయతీ ఓటుగుంట ఎస్టీ కాలనీలో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. వివాహేతర సంబంధాలే హత్యకు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీకాళహస్తి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గుండాగారి రవి రెడ్డి(30) ఏడు సంవత్సరాలుగా ఓటుగుంట ఎస్టీ కాలనీలో బంధువుల ఇంట జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆర్ముగంతో గత కొంతకాలంగా గొడవలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్ముగం కత్తితో రవి రెడ్డి తలను నరికి ఓటుగుంట గ్రామంలోనే దారుణంగా హతమార్చారు. ఫిర్యాదు అందుకున్న రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, మరో వైపు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో తుడా నిధులు రూ.4.80 లక్షలతో నిర్మించిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమం లో ఆస్పత్రి డాక్టర్ పల్లవి, తుడా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఇఇ రవీందర్, మునిసిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, పార్టీ అధ్యక్షులు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ ధనపాల్, మాజీ ఎంపీపీ అమ్ములు (ఏలుమలై) పుత్తూరు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ శంకర్ ఆనంద్, సర్పంచ్ బొబ్బిలి, వెంకటేష్ యాదవ్, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు మండల పరిధిలోని పోటు పాలెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళ్యాణి ఉద్యోగ విరమణ చేశారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు , గూడూరు ఎంఈవో -2 కాంచనలు పాల్గొని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో -2 కాంచన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 28 ఏళ్లగా సేవలు అందించి, ఎంతో మంది విద్యార్థుల ఎదుగుదలకు కృషి చేశారన్నారు. భవిష్యత్ లో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులు ,ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఎస్ శంకరయ్య, పాఠశాల కరస్పాండెంట్ పవన్ , ఉపాధ్యాయులు విష్ణు ప్రియ , పద్మ , శ్రీనివాసులు , కృష్ణమ్మ , నిర్మలమ్మ , యుటిఎఫ్ నాయకులు సుధీర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు ప్రోత్సాహాలు: ఎమ్మెల్యే



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: టీడీపీ కార్యకర్తలకు ఆన్ లైన్ ద్వారా ప్రగతి పథం వైపు తీసుకెళ్లిన ముగ్గురు కార్యకర్తలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అభినందించారు. అంతేకాదు వారి సేవలను గుర్తిస్తూ ప్రోత్సాహక బహుమతులను శనివారం అందించారు. పట్టణ పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో చిట్టత్తూరు బాలాజీ రెడ్డి, ఖాదర్ బాషా, సునీల్ లకు సెల్ ఫోన్లను బహుమతిగా అందించి ప్రత్యేకంగా అభినందించారు. నాడు భవిష్యత్తుకు గ్యారంటీ నుంచి నేడు టీడీపీ సభ్యత్వ నమోదు వరకు ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో అధిక శాతం ఫలితాలను ఈ ముగ్గురు సాధించారు. ఆ మేరకు వీరిని అభినందించి ఈ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు పాల్గొన్నారు.

ఏజిఎస్ హెల్త్ కేర్‌కు 48 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -చంద్రగిరి: మండలంలోని ఏ రంగంపేట వద్ద సాయినాథ్ నగర్ లో ఉన్న మోహన్ బాబు విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలకు చెందిన 48 మంది ఫార్మసీ విద్యార్థులు ఏజిఎస్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఎంపికైనట్లు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి మల్లికార్జున్ తెలిపారు. శనివారం ఎం బి యూ ఫార్మసీ కళాశాల ఆవరణలో ఏ జి ఎస్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ప్రాంగణ ఎంపికలలో ఫార్మసీ విద్యార్థులకు ఏ జి ఎస్ హెల్త్ కేర్ సంస్థ వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించింది. ఈ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 48 మంది ఎంపిక కావడంతో వారికి నియామక పత్రాలను అందించారు. ప్రాంగణ ఎంపికలకు ఎంపికైన విద్యార్థులకు మోహన్ బాబు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామారావు, ఆచార్య కరుణాకరన్, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, ఫైనాన్స్ డైరెక్టర్ రవి శేఖర్ లు కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు.

కరాటేలో బ్లూమింగ్ బడ్స్ విద్యార్థుల విజయ కేతనం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి స్థానిక బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థులు అన్నిరంగాలలో తమ సత్తా చాటుతున్నారు. ఒక వైపు చదువులోను మరో వైపు క్రీడలలోను దూసుకుపోతున్నారు. ఇందులో భాగంగా ఈ నవంబర్ నెలలో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఫస్ట్ ఓపెన్ సౌత్ ఇండియన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2024 వారు నిర్వహించిన కరాటే పోటీలలో సుమారు 2000మంది పాల్గొనగా అందులో చంద్రగిరి బ్లూమింగ్ బడ్స్ స్కూల్ కి చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు.పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న రెడ్డిపల్లి కేయాన్ అండర్ 6 ఇయర్స్,20 కేజీల కేటగిరిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా, 6వ తరగతి చదువుతున్న రెడ్డిపల్లి వరీష అండర్ 14ఇయర్స్-35 కేజీల కేటగిరిలో ద్వితీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. పాఠశాలలో విజేతలను అభినందిస్తూ , వారిని ఉద్దేశించి పాఠశాల కరెస్పాండెంట్ బి.హితేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ "క్రీడలతో పాటు మరియు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వలన దృఢమైన సంకల్పం తో పాటు ఏకాగ్రత కలుగు తుందని తెలిపారు. విద్యార్థులు చదువులో మాత్రమే కాకుండా అన్ని రంగాలలో ముందు ఉండాలని అవి సమాజంలోనూ, భవిష్యత్తులో ను ఎదురయ్యే ఎన్నో సవాల్లను ఎదుర్కోనేలా సంసిద్దపరుస్తుంది తెలిపారు.,మన బ్లూమింగ్ బ్లూమింగ్ బడ్స్ విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ బి.హితేంద్రనాథ్ రెడ్డిగారు,కారాటే మాస్టర్.ఆర్.బాలజి పాల్గొన్నారు.



పతకం సాధించిన విద్యార్థులు

వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: డిసెంబర్ ఒకటో తేదీ ఇవ్వాల్సిన పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు ఈ నెల 30వ తేదీ నుంచి పంపిణీ చేపట్టారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో శనివారం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి పింఛన్ల పంపిణీకి అంతరాయం లేకుండా కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో పలు డివిజన్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తున్నారు. సర్వర్ సమస్యలు ఉన్నచోట వాటిని అప్పటికప్పుడే సంబంధిత సిబ్బందితో ఫోన్లో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నారు. ఓ పక్క వర్షం కురుస్తున్నా పెన్షన్ల పంపిణీ ఆగకుండా ఉండేందుకు ప్రత్యేక సిబ్బందిని కమిషనర్ నియమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్యాధికారి యువ అన్వేష్, అడిషనల్ డిప్యూటీ కమిషనర్లు డివిజన్లలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు.

శ్రీకాళహస్తి: ముందు చూపున్న మహా మనిషి ముఖ్యమంత్రి చంద్రబాబు అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ కొనియాడారు. అందుకే పింఛన్ లబ్ధిదారులకు ఒక్క రోజు ముందే నగదును పంపిణీ చేసి పేదలను ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. పట్టణంలోని రాజీవ్ నగర్‌లో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లి పెన్షన్ నగదును బట్వాడా చేశారు. జనవరిలో సంక్రాంతి కానుకగా కొత్త పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నామని హామీ ఇచ్చారు. నాయకులు విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలో శనివారం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తున్నా ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ల పంపిణీ అంతరాయం లేకుండా మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీకి ఎంపీడీవో త్రివిక్రమరావు ఇబ్బందులు లేకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయం, పంచాయతీ సిబ్బంది అన్ని శాఖల సిబ్బంది ఎక్కడా పింఛన్లకు అడ్డంకులు లేకుండా సజావుగా నిర్వహించారు.

గూడూరు టౌన్ : గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో తిరుపతి పార్లమెంట్ టీడీపీ మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్‌లు పంపిణీ చేశారు. వచ్చే నెలలో నూతన పెన్షన్ లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని , అర్హులైన వారు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యరమాపు హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని రెండవ వార్డులో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పెన్షన్లను అందించారు. వర్షంలోనే తడుస్తూ ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు నగదును అందించారు. గూడూరు నియోజకవర్గం 37 వేల 669 పెన్షన్లు ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ,సిఐ శేఖర్ బాబు,నాయకులు బిల్లు చెంచురామయ్య ,అల్లి భాష ,రహీం, ఇజ్రాయిల్, జహంగీర్ ,పాల్గొన్నారు.

కోట : రాష్ట్ర సీఎం చంద్రబాబు తోనే రాష్ట్రం సుభిక్షింగా ఉంటుందని తిరుపతి పార్లమెంట్ ముస్లిం మైనారిటీ నాయకులు షేక్. జలీల్ అహ్మద్ అన్నారు. రుద్రవరంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులు ఎల్లసిరి జ్యోతి, టీడీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి.చిన్న,పున్నెపల్లి మల్లి, రమణయ్య, వెంకటేశ్వర్లు సమక్షంలో పింఛన్లు అందజేశారు. కొత్తపట్నం పంచాయతీ లో సచివాలయం సిబ్బందితో కలిసి కోట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి, తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇన్నమాల అనోక్ లు పింఛన్లు పంపిణీ చేశారు.



గూడూరు టౌన్

పుత్తూరు టౌన్ : తడుకు సర్పంచ్ పి.వెంకటేష్ ఏ బొబ్బిలి యాదవ్ పుత్తూరు రూరల్ మండలం తడుకు మజ్జిగగుంట ఎస్టీ కాలనీలో వర్షంలో సైతం లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తులసి, అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రామచంద్రాపురం (పాకాల): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా పాకాల మండలం పాకాల పంచాయతీ గాంధీనగర్ లో కూటమి పార్టీ మండల నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తిరుపతి మహిళా పోలీసు డీఎస్పీ ఎం శ్రీలత విద్యార్థులను హెచ్చరించారు. శనివారం న్యూ బాలాజీ కాలనీలోని ఎస్ఙి హెచ్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వ్యసనం, మహిళలపై అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దారి తప్పిన యువతకు దండన తప్పి ప్రవర్తిస్తే కేసులు, శిక్షలు తప్పవన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని, విద్యలో సబ్జెక్ట్ పరంగా పరిజ్ఞానాన్ని సంపాదించుకోవడంలో కృషి చేయాలన్నారు. వ్యసనాల బారిన పడకుండా నిరంతరం లక్ష్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక విలువలు పాటించిన వారిని విజయాలు వర్తిస్తాయని చెప్పారు. యవ్వనపు ఉద్వేగాలను, ప్రతికూల ఆలోచనలను అదుపులో పెట్టుకోవాలని కోరారు. సీఐ టి. అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆదర్శవంతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దీపిక, ఎఎస్ఐ గిరిజ, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు ఇందిరానగర్ కు చెందిన టిడిపి కార్యకర్త మురుగన్(55) అనారోగ్యం తో మరణించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం సాయంత్రం మృతుని స్వగ్రామమైన పిచ్చాటూరు ఇందిరానగర్ కు చేరుకొని మురుగన్ భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం ముగుగన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్నీ విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ ఏం సి మాజీ ఛైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం